
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 23 జూన్ 2024



తహసీల్దార్ల విశ్వప్రయత్నం

జగ్గయ్యపేటలో హై అలర్ట్



విద్యానగర్, మిట్టగూడెంలో ఇంటింటి సర్వే

పెరుగుతున్న డయేరియా కేసులు.. ఆసుపత్రులకు క్యూ

"జగ్గయ్యపేటలో డయేరియా విజృంభిస్తోంది. ఈ వ్యాధి లక్షణాలతో పదుల సంఖ్యలో జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. శుక్రవారం ఇద్దరు, శనివారం నలుగురు మృతిచెందడంతో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. హై అలర్ట్ ప్రకటించారు. ఇంటింటి సర్వే చేపట్టి అనారోగ్య పీడితుల వివరాలు సేకరిస్తున్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, లీకేజీలకు మరమ్మతులు చేయిస్తున్నారు."

నలుగురు మృతి.. ఆరుకు చేరిన మృతుల సంఖ్య

- వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరిన 21 మంది
- వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్
- డీఎంహెచ్‌వోతో పాటు జేసీ, డీసీహెచ్ఎస్‌ల బస

జగ్గయ్యపేట, జూన్ 22 : జగ్గయ్యపేటలో డయేరియా లక్షణాలతో శనివారం నలుగురు మృతిచెందారు. జగ్గయ్యపేటకు చెందిన ఉమ్మినేని రంగయ్య, బూదవాడ, గండ్రాయి, వేదాద్రి గ్రామాలకు చెందిన మరో ముగ్గురు మహిళలు శనివారం చనిపోయారు. పట్టణంలో పలు ప్రాంతాల్లోని ఆసుపత్రులకు డయేరియా లక్షణాలతో ఎంతోమంది క్యూ కడుతున్నారు. వీరిలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. పట్టణంలోని విద్యానగర్, చిల్లకల్లు, మిట్టగూడెం, సీతారాంపురం, తోటబజార్, డాంగేనగర్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలైన షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, గండ్రాయి, మక్కపేటలో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, మక్కపేట గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. డయేరియా లక్షణాలున్న వారిని జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నారు. పురపాలక సంఘం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి, డయేరియా కేసులను జల్లెడ పడుతున్నారు. అన్ని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ప్రధానమైన లీకేజీలను గుర్తించి వాటిని సరిచేసేందుకు చర్యలు చేపట్టారు.

అధికారులు అప్రమత్తం

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి శనివారం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో రోగులను పరామర్శించిన ఆమె డీఎంహెచ్‌వో సుహాసినీ, డీసీహెచ్ఎస్ నాయక్, నందిగామ ఆర్డీవో రవీంద్ర, సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ హరీష్, ఇతర వైద్యులతో సమీక్షించారు. డయేరియా లక్షణాలు కనిపిస్తున్న గ్రామాల్లో సర్వేలు చేయాలని, అనుమానిత కేసులను గుర్తించాలని, అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న జేసీ సంపత్‌కుమార్

జేసీ, డీసీహెచ్ఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణ

జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, జిల్లా ఆసుపత్రి సేవల కో-ఆర్డినేటర్ బీసీకే నాయక్ శనివారం ఆసుపత్రిలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి, మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అత్యవసర చర్యలను సూచించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని, వాటర్ ప్లాంట్లలో నీటి వనరులను పరిశీలించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగండి
- ప్రజలకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సూచన

6లో..

చికిత్స పొందుతున్నది వీరే..

జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వత్సవాయికి చెందిన భార్యాభర్తలు ప్రభావతి (60), నాగేశ్వరరావు (70), చిల్లకల్లుకు చెందిన అక్కాచెల్లెలు సూర్యకుమారి (10), డింపుల్ ధరణి (9), నాయనమ్మ, మనుమలు ఎం.సావిత్రి, ఎం.మహేంద్ర (15), లోకేశ్ (12), బి.హాసిని (9), సీతారాంపురానికి చెందిన తల్లీకొడుకులు సుజాత (25), గౌతమ్ (9), మిట్టగూడేనికి చెందిన లక్ష్మీప్రసన్న (12), శేషమ్మ (60), కవిత (16), తోటబజార్‌కు చెందిన షేక్ అయేషా (13), విద్యానగర్‌కు చెందిన ఎస్.పూజి (16), గండ్రాయికి చెందిన వల్లాల విజయమ్మ (55), మక్కపేటకు చెందిన భార్యాభర్తలు గోపాలకృష్ణ, త్రివేణి, మంగోల్లుకు చెందిన నాగూర్‌బీ (20), షేర్‌మహ్మద్‌పేటకు చెందిన వై.అచ్చమ్మ (80), సింగవరం గ్రామానికి చెందిన టి.నరసింహారావు (19), చిట్యేలకు చెందిన మాలచ్చయ్యలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బదిలీల కోసం తహతహ

- ఏపీఆర్ఎస్ఏపై తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్న అధికారులు
- ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు పాతుకుపోతారని ఆందోళన
- పాత జిల్లాలతోపాటు మండలమూ కావాలట
- అక్రమాలకు అనువుగా ఉండటమే కారణం
- గత ఐదేళ్లలో కార్యాలయాల్లో ఉంది తక్కువ.. కాసుల యావతో వైసీపీ సేవలో ఎక్కువ
- రివర్స్ బదిలీల్లో సొంత మండలాలకు రాకుండా చర్యలు చేపడితేనే అక్రమాలకు అడ్డు

"సొంత జిల్లాలకు బదిలీల కోసం ఉమ్మడి కృష్ణాజిల్లా తహసీల్దార్లు తహతహలాడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి బదిలీలపై వచ్చిన వారిలో కొందరు ఇక్కడే ఉండిపోవటానికి ప్రయత్నాలు చేయటంతో సొంత జిల్లా తహసీల్దార్లలో ఆందోళన నెలకొంది. వీరు రివర్స్ బదిలీల కోసం పట్టుపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన తహసీల్దార్లు.. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడగానే.. తమ బదిలీలపై దృష్టి సారించారు. ఏపీ రెవెన్యూ సర్వీసు అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) అగ్ర నాయకత్వంపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు."

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తహసీల్దార్ల సంఘాలు అన్నీ ఏపీఆర్ఎస్ఏలో విలీనమై ఒకే గొడుగు కింద పనిచేస్తుండటంతో అగ్ర నాయకత్వానికి బదిలీల సమస్య తప్పటం లేదు. రెవెన్యూ శాఖ మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజునే ఏపీఆర్ఎస్ఏ అగ్ర నాయకత్వం వెళ్లి బదిలీలపై మాట్లాడాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సానుకూలంగా స్పందించినప్పటికీ ప్రభుత్వ స్థాయిలో విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది కాబట్టి కొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

తహసీల్దార్లు ఎందుకు ఒత్తిడి చేస్తున్నారంటే..

తహసీల్దార్లలో ఎందుకు ఇంత ఆందోళన నెలకొన్నదన్న అంశాన్ని పరిశీలిస్తే .. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు ఇక్కడ సీటు కదలటానికి ఇష్టపడకపోవటమే ప్రధాన కారణమని తెలుస్తోంది. దీంతోపాటు అక్రమంగా ఆర్జించటానికి అనేక అవకాశాలు ఉండటం.. మూడు నెలలుగా అవినీతి రుచి మరగటంతో .. ఇక్కడ నుంచి కదలకూడదన్న ప్రయత్నాలను ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు చేస్తున్నారు. దీనికోసం పైరవీలు కూడా చేస్తున్నారు. సొంత జిల్లాలకు వచ్చే క్రమంలో గతంలో తాము పనిచేసిన స్థానాలలోనే పనిచేసేందుకు ఉబలాటపడుతున్న తహసీల్దార్లకు, పొరుగు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్ల చర్యలు ఇబ్బందికరంగా మారాయి. దూరాభారాన ఉండటంతో .. తాము ఏమీ చేయలేకపోతున్నామని, సొంత జిల్లాలకు వస్తే ఏదైనా ప్రయత్నాలు చేయవచ్చన్న ఆలోచనతో ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారు ఇప్పటికే తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేల దగ్గర పైరవీలు ప్రారంభించారు. ఎమ్మెల్యేలు ఎలాంటి హామీలు ఇవ్వనప్పటికీ.. పొరుగు జిల్లాల్లో ఉన్న మన జిల్లా తహసీల్దార్లు మాత్రం కంగారు పడుతున్నారు.

సొంత జిల్లాకొచ్చినా పాత మండలం కష్టం

ఎన్నికల నేపథ్యంలో, ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లను ఎన్నికల అనంతరం తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయటం ఆనవాయితీ. దీన్ని కొనసాగించే క్రమంలో సొంత జిల్లాలకు బదిలీ చేస్తారే తప్ప సొంత మండలాలకు బదిలీ చేయరు. సీసీఎల్ఏ అధికారులు గంపగుత్తగా ఒక జిల్లాకు చెందిన తహసీల్దార్లను మరో జిల్లాకు కేటాయిస్తారు. ఇలా మరో జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు అక్కడి జిల్లా కలెక్టర్లు మండలాలను కేటాయిస్తారు. తిరిగి వీరంతా సొంత జిల్లాలకు బదిలీ చేసినపుడు కూడా ఆయా జిల్లాల కలెక్టర్లే మండలాలను కేటాయిస్తారు. గతంలో కేటాయించిన మండలాలను కేటాయించరు. కానీ, తహసీల్దార్లు మాత్రం ఏదో రకంగా ఎన్నికల ముందు పనిచేసిన మండలాల్లోనే పనిచేసేందుకు ఆసక్తి చూపించడం గమనార్హం.

ఏసీ అక్రమాలపై ముచ్చెమటలు

ప్రశ్నల వర్షం కురిపించిన ఆర్‌జేసీ



శివాలయానికి సంబంధించిన కల్యాణమండపాన్ని పరిశీలించి దానిని స్వాధీనం చేసుకోవాలని ఈవోకు ఆదేశాలిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు

- ఆర్‌జేసీ వస్తున్నారని తెలిసి తప్పించుకోజూసిన ఏసీ
- హైదరాబాద్ వెళుతూ నాగాయలంకలో ఉన్నట్టు నమ్మించే యత్నం
- లొకేషన్ పెట్టాలని ఆర్‌జేసీ కోరడంతో హడావిడిగా వెనక్కి పయనం
- అక్రమాలపై త్వరలో నివేదిక ఇస్తానన్న ఆర్‌జేసీ

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల దేవదాయశాఖ సహాయ కమిషనర్ (ఏసీ) అవినీతి అక్రమాలపై ప్రభుత్వం స్పందించింది. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ విచారణకు ఆదేశించడంతో విచారణ అధికారిగా దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్ (ఆర్‌జేసీ) సుబ్బారావు శనివారం విజయవాడలో విచారణ నిర్వహించారు. దేవాలయాలను, ఆస్తులను, రికార్డులను పరిశీలించి అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. మరోపక్క ఆర్‌జేసీ వస్తున్నారని తెలిసి ఏసీ హైదరాబాద్ పయనమయ్యారు. లొకేషన్ పంపమని అడగడంతో మార్గమధ్యలోనే వెనుదిరిగి విజయవాడ చేరుకున్నారు. విచారణ సమయంలో అధికారులకు ఆర్‌జేసీ ముచ్చెమటలు పట్టించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ, జూన్ 22 : దేవదాయ శాఖ ఏసీ అవినీతి, అక్రమాలపై ఇటీవల ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించింది. వీటిపై దేవదాయశాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారులు ఆరా తీశారు. విచారణ చేపట్టాల్సిందిగా కమిషనర్‌కు సూచించారు. వన్‌టౌన్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సుబ్బారావు విచారణ చేపట్టారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి ఈవో మోహనరావు, గుమస్తా అజయ్‌కుమార్‌లను దేవస్థానంలో జరిగిన అవినీతి అక్రమాలపై అడిగి తెలుసుకున్నారు.

- **షాపింగ్ కాంప్లెక్ కూల్చివేతపై ప్రశ్నల వర్షం**

దేవస్థానానికి చెందిన గవర్నరుపేటలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో భవనంపై ఉన్న మొదటి అంతస్తును ఎవరు కూల్చారు? ఎందుకు కూల్చారు? కూల్చిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని ఆర్‌జేసీ ప్రశ్నించారు. లీజు కాల పరిమితి ముగిసి 14 సంవత్సరాలయినా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని అడిగారు. లీజుదారుడు పెద్ద మొత్తంలో బకాయి ఉన్నప్పుడు పంచనామా చేసి షాపును స్వాధీనం చేసుకోవడంతో పాటు టెండర్లను ఎందుకు పిలవలేదని నిలదీశారు. ఇందుకు సంబంధించిన రికార్డుల జిరాక్స్ కాపీలను ఆయన తీసుకున్నారు.

- **రికార్డులు పరిశీలించి వివరాల సేకరణ**

భ్రమరాంబా మల్లేశ్వరాలయం (పాతశివాలయం)లోని విఘ్నేశ్వర రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం రికార్డులను పరిశీలించారు. గవర్నరుపేటలో ఉన్న దుకాణాల లీజు పూర్తి వివరాలు సేకరించారు. అనధికారికంగా ఉంటున్న వారిని ఎందుకు ఖాళీ చేయించలేదు? కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? అద్దె బకాయిలను ఎందుకు రాబట్టడం లేదు? అసలు లీజుదారులు ఎవరు? అని ఈవో సురేష్‌ను నిలదీశారు. తరువాత ఆయన సంబంధిత షాపులను పరిశీలించారు. అద్దెకుంటున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

- **చల్లంరాజు సత్రం పరిశీలన**

సామారంగం చౌక్‌లోని చల్లంరాజుసత్రంను కూడా పరిశీలించారు. ఈవో సత్యప్రసాద్‌ను సంబంధిత లీజులు, అద్దెలు, బకాయిలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. లీజు ఒప్పందాల నకళ్లను తీసుకున్నారు. అనంతరం సత్యనారాయణపురంలోని శివాలయం పక్కనే ఉన్న కల్యాణ మండపాన్ని పరిశీలించారు. ఈవో సుభద్రాదేవిని కల్యాణమండపానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కల్యాణమండపాన్ని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో చెప్పాలన్నారు. కల్యాణమండపంలో పరిశీలిస్తున్న సమయంలో మండపం నిర్వాహకులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీనిపై ఆర్‌జేసీ ప్రశ్నించగా ఈవో చెప్పడంతో సిబ్బంది లక్ష్మి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించింది.

ఆర్‌జేసీ అంటే ఏసీకి లెక్కలేదు

విచారణ నిమిత్తం ఆర్‌జేసీ సుబ్బారావు వస్తున్నారని తెలిసి కూడా ఏసీ శాంతి హాజరు కాలేదు. వెంకటేశ్వరస్వామి గుడిలో విచారణ చేస్తున్న సమయంలో ఏసీ ఎక్కడ అని సుబ్బారావు ప్రశ్నించగా.. అక్కడి ఈవో మోహనరావు ఇన్‌స్పెక్టర్ అనురాధ, సూపరింటెండెంట్ శెట్టి సమాధానం చెప్పలేక తటపటాయించారు. ఆ తరువాత నాగాయలంకలో ఒక దేవస్థానానికి చెందిన భూముల తనిఖీకి వెళ్లినట్టు తెలిపారు. సుబ్బారావు వెంటనే స్పందించి అక్కడి ఈవో, గుమస్తాతో ఫోన్‌లో మాట్లాడి, ఏసీ ఉన్న లోకేషన్‌ను వాట్సాప్ ఫొటో పంపాలని ఆదేశించారు. అయితే సాయంత్రం ఆరు గంటల వరకు వారి నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఆరు గంటల తరువాత చల్లంరాజు సత్రంలో ఆర్‌జేసీ ఉన్నపుడు అక్కడికి హడావుడిగా ఏసీ శాంతి చేరుకున్నారు. అయితే సుబ్బారావు ఆమెతో ముక్తసరిగా మాట్లాడి బయటకు వచ్చేశారు. ఆర్‌జేసీ విచారణకు వస్తున్నారని సిబ్బంది తెలిపినా ఆమె తాను హైదరాబాద్ వెళుతున్నట్టు వారికి చెప్పారు. అయితే ఆర్‌జేసీ లోకేషన్ పెట్టమని అడగడంతో ఆమె మార్గం మధ్య నుంచి విజయవాడ వచ్చినట్టు తెలిసింది. విచారణ నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆర్‌జేసీ తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా సృజన

గతంలో కృష్ణాజిల్లా సబ్ కలెక్టర్‌గా విధులు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి గుమ్మళ్ల సృజన కలెక్టర్‌గా రానున్నారు. ప్రస్తుతం ఆమె కర్నూలు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సృజన 2015లో కృష్ణాజిల్లా సబ్ కలెక్టర్‌గా చేశారు. ఆమె గ్రేటర్ విశాఖ మున్సిపల్ కమిషనర్‌గా కూడా పనిచేశారు. ఆ సమయంలో కరోనా ప్రబలుతుండగా, ఆమె మాత్రం ఓ బిడ్డకు జన్మనిచ్చి, మెటర్నిటీ సెలవు ఉపయోగించుకునే అవకాశం ఉన్నా, తన బిడ్డతో సహా విధులకు హాజరుకావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. గుమ్మళ్ల సృజన తండ్రి బలరామయ్య ఐఏఎస్ అధికారి. తల్లి సుగుణశీల గృహిణి. భర్త రవితేజ హైకోర్టు అడ్వకేట్‌గా చేస్తున్నారు. సృజన విద్యాభ్యాసం మొత్తం హైదరాబాద్‌లో జరిగింది. బీఏ సెయింటాన్స్‌లో, ఎంఏ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చేశారు. శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. సృజన భర్త రవితేజ ప్రముఖ సోషలిస్టు నాయకుడు వాసిరెడ్డి కృష్ణారావు మనవడు.

నిన్న నానితో.. నేడు కఠారి వెంట



మాజీ మంత్రి కఠారి వెంట గడ్డం గ్యాంగ్ సభ్యుడు కాళి

- మాజీ మంత్రి కఠారి చెంతకు గడ్డం గ్యాంగ్
- ఎన్నికల ఫలితాల వరకు నాని చెప్పిందే వేదం
- పదేళ్ల వరకూ ఏమీ చేయలేనని చెబుతున్న నాని

గత ఐదేళ్లలో జిల్లాలో మారుమోగిన పేరు కొడాలి నానిస్ గడ్డం గ్యాంగ్. సామాన్యుల నుంచి ప్రతిపక్ష నాయకుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసి గుడివాడలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఇలాంటి వారు ఒక్కసారిగా మారారా...? అంటే గుడివాడ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

గుడివాడ : సార్వత్రిక ఎన్నికల ఫలితాల వరకు గుడివాడలో మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పిందే వేదంగా ఉండేది. ఆయన చెప్పినట్టే గడ్డం గ్యాంగ్ అరాచకం సృష్టించేవారు. ఎంతటివారైనా వారిని మానసికంగా, శారీరకంగా హింసించి ఆనందం పొందేవారు. డబ్బు కోసం ఎంతకైనా తెగించి ఎదుటి వారిని చిత్రహింసలకు గురి చేసేవారు. నానిని విమర్శించినా, వైసీపీని ప్రశ్నించినా ఫోన్లు చేసి బెదిరించేవారు. ఇళ్ల చుట్టూ రెక్కీ నిర్వహించేవారు. నాని కళ్లలో ఆనందం కోసం శ్రమించారు. నాని సైగ చేస్తే మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుపైనా, పెట్రో దాడి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తికి చెందిన హోటల్, కారుపైనా, టీడీపీ నాయకులపైనా దాడులకు తెగబడ్డారు. 2019 ఎన్నికల్లో యలవర్తి వెంట ఉన్నాడనే నెపంతో సామాన్యుడైన దళిత యువకుడినేతై బంధించి తీవ్రంగా కొట్టారు. నాని ఆదేశాలతో 66 మందికి చెందిన ప్లాట్‌లను ఆక్రమించుకున్నారు. నాని ఘోరంగా ఓటమి చెందటంతో పక్షం రోజులుగా కనిపించకుండా పోయారు. దీంతో నియోజకవర్గ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కఠారి జన్మదిన వేడుకల్లో మెరిసి..

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని మాట జవదాటని గడ్డం గ్యాంగ్ మాజీ మంత్రి కఠారి జన్మదిన వేడుకల్లో తళుక్కున మెరిశారు. దీంతో ప్రజల్లో ఒకింత భయాందోళన నెలకొంది. ఘోర ఓటమి అనంతరం కొడాలి నాని దగ్గరకు వస్తున్న నాయకులు, కార్యకర్తలకు పదేళ్ల వరకు తానేమి చేయలేనని చేతులెత్తేసినట్టు సమాచారం. నాని మాటే వేదంగా అరాచకానికి కేంద్ర బింధువుగా నిలిచిన గడ్డం గ్యాంగ్ ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించింది. ప్రతిపక్షాలపై ఇష్టానుసారంగా నోరుపారేసుకున్న ఉన్న కొడాలి నాని వెంట సేఫ్ కాదనే భావనతో మాజీ మంత్రి కఠారి వద్ద ఆశ్రయం పొందడానికి వచ్చినట్టు వైసీపీ నేతలే చెబుతున్నారు. కఠారి కూడా వారికి వత్తాసు పలుకుతూ వారంతా సత్యశీలురంటూ చిలకపలుకులు పలికారు.

కొడాలికి సీన్ లేనట్టేనా...?


గత ఎన్నికల ముందు ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనకు 2024 ఎన్నికలే తనకు చివరివని నాని స్పష్టం చేశారు. నాని వెంట నడిచిన వారు కూడా పక్కచూపులు చూస్తున్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. ఓటమి అనంతరం బహిర్గతమైన అంతర్గత కలహాలు కూడా నానికి తలనొప్పిగా మారాయి. గడ్డం గ్యాంగ్, నాని వెంట నడిచిన ఆ ఏడుగురు ఓటమికి ప్రధానమంటూ వైసీపీ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. 20 ఏళ్లుగా ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి చేసిందేమి లేదని ప్రజల ఆరోపిస్తున్నారు. మంత్రిగా మూడేళ్లలో ఒక్క రూపాయి నిధులు కూడా తేలేక చేతులెత్తేశారని దుమ్మెత్తి పోస్తున్నారు.

బెజవాడలో 'సీ ఫ్యాన్స్' దొంగ



- సముద్రగర్భంలో వన్యప్రాణుల స్మగ్లింగ్
- ఫొటో ఫ్రేముల్లో అమర్చి లక్షలాది రూపాయలకు అమ్మకాలు
- సీ ఫ్యాన్స్ ఇంట్లో ఉంటే కుబేరులవుతారని ప్రచారం
- వీడియోల ఆధారంగా ట్రాప్ వేసిన డబ్ల్యూజేసీ
- రూ.91.25 లక్షల వన్యప్రాణి సంపద స్వాధీనం
- దేశంలోనే అతిపెద్ద స్మగ్లింగ్ అంటున్న అధికారులు

విజయవాడ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): సముద్రగర్భంలో 10 నుంచి 20 మీటర్ల లోతులో పరిశుభ్రమైన ప్రదేశంలో వివిధ వర్ణాల్లో నెమలి పురి విప్పినట్టుగా కనిపించే ఆకారాలవి. వీడియోలు, ఫొటోల్లో చూసిన వాళ్లంతా వాటిని సముద్రగర్భంలో పెరిగే మొక్కలు అనుకుంటారు. వన్యప్రాణి పరిభాషలో వాటిని సీ ఫ్యాన్స్‌గా వ్యవహరిస్తారు. అంతరించిపోతున్న జాతి జాబితాలో ఉన్న ఈ సీఫ్యాన్స్ ప్రాణులతోపాటు వన్యప్రాణుల శరీర భాగాలను ఫొటో ఫ్రేమ్‌లుగా తయారుచేసి లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్న వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.91.25 లక్షల విలువైన వన్యప్రాణి సంపదను స్వాధీనం చేసుకున్నారు. దేశంలో వన్యప్రాణి సంపదను ఇంత పెద్దమొత్తంలో సీజ్ చేయడం ఇదే ప్రథమమని అధికారులు





అయ్యప్పనగర్‌లో అక్షయనిధి పేరుతో షాపు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

తెలిపారు. వివరాలను వైల్డ్‌లైఫ్ జస్టిస్ కమిషన్ ఇండియా హెడ్ ఎస్‌కేడీ నీరజ్, ఎన్టీఆర్ జిల్లా అటవీశాఖాధికారి ఏవీఎస్ఆర్‌కే అప్పన్న, విజిలెన్స్ విభాగ డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ, విజిలెన్స్ విభాగ రేంజ్ అధికారి ఎం.శంకరయ్య శనివారం వెల్లడించారు. విజయవాడకు చెందిన ఎస్.శ్రీనివాసరావు మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. మహారాష్ట్రలోని విద్యుత్ ప్లాంట్‌లో కొన్నాళ్లు పని చేశాడు. దాన్ని మూసేయడంతో తిరిగి విజయవాడకు చేరుకున్నాడు. అయ్యప్పనగర్‌లో అక్షయనిధి పేరుతో ఓ షాపును ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో అడవినక్క తోక, ఏనుగు తోక వెంట్రుకలతో తయారు చేసిన బ్రాస్‌లెట్లు, సముద్రపు తేలు, పాములు విడిచిన చర్మం(కుబుసం), జింక చర్మం, సముద్రగర్భంలో పెరిగే సీ ఫ్యాన్స్‌ను తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. సీ ఫ్యాన్స్ ఎండిపోయిన మొక్క మాదిరిగా మారిన తర్వాత ఫొటో ఫ్రేమ్‌లో అమర్చి అమ్ముతున్నాడు. ఒక్కో ఫ్రేమ్‌ను రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయిస్తున్నాడు. వాటి అమ్మకాలను పెంచుకోవడం కోసం యూట్యూబ్‌లో ఇంద్రజాలం, మహాఇంద్రజాలం పేరుతో వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నాడు.

ట్రాప్ ఇలా...

"నేను ఈ వీడియోలో చూపిస్తున్న వాటిని విక్రయించడం చట్టరీత్యా నేరం. ఈ వస్తువులు ఇంట్లో పెట్టుకుంటే సకల సిరిసంపదలు కలుగుతాయి. తక్కువ కాలంలోనే కుబేరవులతారు." శ్రీనివాసరావు తీసిన వీడియోల్లో వ్యాఖ్యానం ఇది. ఈ వీడియోలు అంతర్జాలంలో హద్దులు దాటి వెళ్లాయి. సముద్రగర్భంలో ఉండే వన్యప్రాణుల స్మగ్లింగ్ జరుగుతుందని తమిళనాడులోని రామేశ్వరంలో ఉన్న కొందరు గుర్తించారు. ఈ సమాచారాన్ని చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వైల్డ్‌లైఫ్ జస్టిస్ కమిషన్‌కు అందజేశారు. ఈ కమిషన్ అధిపతి నీరజ్ ఆధ్వర్యంలో కొంతమంది కొద్దిరోజుల క్రితం విజయవాడకు చేరుకున్నారు. అటవీ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. అటవీ శాఖలో ఉండే విజిలెన్స్ విభాగ అధికారులు అక్షయ నిధి షాపు వద్ద రెక్కీ నిర్వహించారు. కొనుగోలుదారులుగా వెళ్లి బేరాలు మాట్లాడారు. షాపుతోపాటు గోడౌన్‌లో ఉన్న సరుకును పరిశీలించారు. వెంటనే శుక్రవారం రాత్రి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. అతడిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టంలోని 39, 40, 43, 44, 55 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. శనివారం కోర్టులో హాజరుపర్చగా శ్రీనివాసరావుకు రిమాండ్ విధించింది. అధికారుల విచారణలో అతడు పూర్తి వివరాలు వెల్లడించలేదు. ఈ సరుకును ఎక్కడి నుంచి తీసుకొస్తున్నావని ప్రశ్నించగా వరంగల్ జిల్లా మేడారంలో నిర్వహించిన సమ్మక్క, సారక్క జాతరలో కొనుగోలు చేసినట్టు వెల్లడించాడు. దీన్ని అటవీ అధికారులు విశ్వసించడం లేదు. ఏడాదిన్నరగా ఈ వ్యాపారం చేస్తున్నట్టు వివరించాడు.

ఇదీ సీ ఫ్యాన్స్ చరిత్ర

సముద్రగర్భంలో బాగా అడుగుభాగాన అత్యంత పరిశుభ్రమైన ప్రదేశంలో పెరిగే ప్రాణులు సీ ఫ్యాన్స్. వాటి ముఖం నేలను తాకుతుంది. తల తర్వాత నుంచి పెరిగే శరీరంతా ఎదుగుతున్న మొక్కకు విస్తరించే కొమ్మల్లా ఉంటుంది. సంతానోత్పత్తిని పెంచుకుని ఉన్న ప్రదేశంలో చిన్న చిన్న కాలనీలను ఏర్పాటు చేసుకుంటాయి. సముద్రపు నీరు పరిశుభ్రంగా ఉన్న చోట, అలజడులు లేని ప్రశాంతమైన ప్రదేశంలో పెరుగుతాయి. సముద్ర మట్టానికి 20 నుంచి 30 మీటర్ల లోతులో ఉంటాయి. వీడియోలు, ఫొటోల్లో మొక్కలా కనిపిస్తాయి. వాటిని కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ 1లో చేర్చింది. అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్నాయి. వివిధ పరిమాణాల్లో ఉన్న సీఫ్యాన్స్‌ను శ్రీనివాసరావు నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో సీ ఫాన్ వయస్సు 25 నుంచి 50 ఏళ్లు ఉంటుందని తెలిపారు. ఈ తరహా ప్రాణులు అండమాన్ నికోబార్ దీవులు, లక్ష్యదీప్, రామేశ్వరం, తుత్తుకూడి, శ్రీలంక, గుజరాత్ ప్రాంతాల్లో సముద్రగర్భంలో ఉంటాయి.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న

హైకోర్టు న్యాయమూర్తి సుమతి

మోపిదేవి, జూన్ 22: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. వారికి స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో ఎస్.ఎస్. చక్రధరరావు అందజేశారు.



నాగపుట్టలో పాలు పోస్తున్న జస్టిస్ సుమతి దంపతులు

ఇన్‌స్పెక్టర్‌కు డిప్యూటీ సీఎం పవన్ ఫోన్

- యువతి అదృశ్యం కేసుపై ఆరా

విజయవాడ, జూన్ 22(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ మాచవరం ఇన్‌స్పెక్టర్ గుణరాంకు ఫోన్ చేశారు. ఓ యువతి అదృశ్యం కేసుపై ఆయన ఆరా తీశారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువతి విజయవాడ మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌మేనేజ్‌మెంట్ కళాశాలలో చదివేది. ఏనికేపాడుకు చెందిన షణ్ను అనే యువకుడు అదే కళాశాలలో చదివేవాడు. ఆ యువతి, షణ్ను గడచిన ఏడాది నవంబరులో అదృశ్యమయ్యారు. దీనిపై యువతి తల్లి మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జనవరిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇప్పటి వరకు యువతి ఆచూకీ లభించలేదు. పలుమార్లు బాధితురాలు పోలీసుల వద్దకు వెళ్లింది. పోలీసులు అప్పటి వరకు చేసిన దర్యాప్తును ఆమెకు వివరించేవారు. తర్వాత నుంచి పోలీసులు పూర్తిగా ఎన్నికల విధుల్లో మునిగిపోయారు. యువతి తల్లి ఐదు రోజుల క్రితం మాచవరం ఇన్‌స్పెక్టర్ గుణరాంను కలిసింది. దర్యాప్తును మళ్లీ ప్రారంభిస్తామని చెప్పి వారిని ట్రాక్ చేయడానికి సైబర్ క్రైం పోలీసుల వద్దకు తీసుకెళ్లారు. శనివారం ఆమె నేరుగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి తన వ్యధను విన్నవించుకుంది. పవన్ తన కో ఆర్డినేటర్‌తో మాచవరం ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేయించారు. ఆయన ఫోన్ చేసి జంగారెడ్డిగూడెం యువతి మిస్సింగ్ కేసు ఐడియా ఉందా అని అడిగాడు. దీనికి ఇన్‌స్పెక్టర్ ఉందని సమాధానం చెప్పారు. తర్వాత పవన్ కల్యాణ్ మాట్లాడతారని ఆయనకు ఫోన్ ఇచ్చాడు. పవన్ హలో.. అనగానే గుణరాం నమస్తే సార్ అని పలకరించారు. దీనికి పవన్ స్పందించి "నమస్తే ఇన్‌స్పెక్టర్ గారు జంగారెడ్డిగూడెం యువతి మిస్సింగ్ కేసు విషయంలో ఆమె తల్లి నా వద్దకు వచ్చారు" అని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు వివరాలను డిప్యూటీ సీఎంకు గుణరాం వివరించారు. యువతి, షణ్నుల ఫోన్లను ట్రాక్ చేసి వారు హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. వారు అక్కడ ఒక లాడ్జిలో బస చేసిన తర్వాత వెళ్లిపోయారన్నారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీని సేకరించామన్నారు. తర్వాత వారు ఫోన్లను మరొకరికి విక్రయించేశారన్నారు. వారి ఈ మెయిల్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంటర్లను ట్రాక్ చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. షణ్ను ఇంతకుముందు ఒక యువతిని ఈవిధంగానే తీసుకెళ్లిపోయాడని స్నేహితులను విచారించగా తేలిందని వివరించారు. ఈ దర్యాప్తును కొనసాగిస్తూనే యువతి కుటుంబసభ్యుల వద్దకు చేర్చాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆ తర్వాత జనసేన కార్యాలయ సిబ్బందితో యువతి తల్లిని పోలీసు కమిషనర్ కార్యాలయానికి పంపారు. కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ యువతి ఆచూకీని ఛేదించడానికి ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సీపీ ఆదేశించారు.



మందడంలో వెనిగండ్ల రాముకు హారతి పడుతున్న రాజధాని ప్రాంత మహిళలు, రైతులు

ఎమ్మెల్యే వెనిగండ్లకు అపూర్వస్వాగతం

గుడివాడ: గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నానిపై భారీ మెజారిటీతో విజయం సాధించిన వెనిగండ్ల రాముకు రాజధాని ప్రాంత రైతులు, మహిళలు ఘనస్వాగతం పలికారు. అసెంబ్లీ సమావేశాలకు వెళుతూ శనివారం అమరావతిలోని మందడం గ్రామంలో వేణుగోపాలస్వామిని ఆయన దర్శించుకున్నారు. దేవస్థానం వద్ద ఎమ్మెల్యే వెనిగండ్లకు మహిళలు మంగళ హారతులు పట్టి అపూర్వస్వాగతం పలికారు. కొడాలి నానీని అసెంబ్లీలో అడుగుపెట్టకుండా చిత్తుచిత్తుగా ఓడించిన వెనిగండ్లకు తామంతా రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు.

రాజకీయ సన్యాసమా, క్షమాపణా..

కొడాలి నానీ ఏదో ఒకటి తేల్చుకో

- ఎన్నికల ముందు చేసిన సవాళ్లపై టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ డిమాండ్

విద్యాధరపురం, జూన్ 22: "కుప్పంలో చంద్రబాబు గెలిచినా, జగన్మోహన్ రెడ్డిని అధికారంలో నుంచి దించినా రాజకీయ సన్యాసం చేస్తానని ఎన్నికల ముందు గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని సవాల్ చేశారు. ఇప్పుడు రాజకీయ సన్యాసం చేస్తారో? క్షమాపణలు చెబుతారో ఏదో ఒకటి తేల్చుకోవాలి." అని కొడాలి నానీని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్ డిమాండ్ చేశారు. గురునానక్‌కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడాలి నానీ మాట మీద నిలబడితే అతను రాజకీయ సన్యాసం చేసి రాష్ట్రం విడిచిపెట్టి పోవాలని లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన కొడాలి నానీకి మీడియా ముందుకు వచ్చి మాట్లాడే హక్కు, టీడీపీ హామీలపై ప్రశ్నించే హక్కు లేదన్నారు. ఏమైనా సమస్యలుంటే గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కొడాలి నానీ, సీఎం చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్‌రెడ్డి అర్జీలు సమర్పించుకోవాలన్నారు. టీడీపీ నాయకులు తమపై దాడులు చేశారని చెప్పామని వైసీపీ వాళ్లు అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. చంద్రబాబు ఏనాడూ దాడులు చేయాలని కార్యకర్తలను ప్రోత్సహించలేదన్నారు. గతంలో జరిగిన సంఘటనలను జగన్‌రెడ్డి ఏనాడూ ఖండించలేదన్నారు. రుషికొండ ప్యాలెస్ జగన్ నివాసం ఉండేందుకు అని అప్పుడు చెప్పి, ఇప్పుడు టూరిజం గెస్ట్‌హౌస్ అని మాట మారుస్తున్నారన్నారు.

---

1 నుంచి స్టాప్ డయేరియా

రెండు నెలల పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు

- పారిశుధ్యం, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- వివిధ శాఖల అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు దిశానిర్దేశం

కృష్ణలంక, జూన్ 22: "కేంద్ర, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖల మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు మూడు దశల స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖలు సన్నద్ధమవ్వాలి. అధికారులు సమన్వయంతో పనిచేసి, అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం ద్వారా డయేరియాను సమర్థవంతంగా అడుకోవచ్చు." అని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు దిశానిర్దేశం చేశారు. శనివారం వైద్య, ఆరోగ్యం, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, మున్సిపల్, గ్రామీణ నీటిసరఫరా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ప్రత్యేక ప్రచార కార్యక్రమ అమలుకు ఇంటింటి సర్వే నిర్వహణ, ఐదేళ్లలోపు చిన్నారుల వివరాల సేకరణ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్ల పంపిణీపై ఆయన సూచనలు చేశారు. ప్రస్తుతం ఒకటి రెండు చోట్ల డయేరియా కేసులు నమోదవుతున్నందున క్షేత్రస్థాయిలో వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రతపై ప్రజలకు, చిన్నారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించడం, తాగునీటి పరీక్షలు చేయించడం ద్వారా తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. వర్షపు నీరు నిలవకుండా చూడాలని, డ్రెయినేజీ వ్యవస్థలు మెరుగుపరచాలని ఆదేశించారు. కలుషిత ఆహారం ముప్పుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా డయేరియా కేసులు నమోదైతే వారికి సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. డీఐవో డాక్టర్ అమృత, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.



విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు సలహాలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

జీజీహెచ్‌లో కలెక్టర్ పరిశీలన

విజయవాడలోని కొత్త ప్రభుత్వాసపత్రిని శనివారం కలెక్టర్ ఢిల్లీరావు సందర్శించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. జగ్గయ్యపేటలో డయేరియా కేసులు వెలుగు చూడటం, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండటంలో భాగంగా కొత్త ప్రభుత్వాస్పత్రిలో 15 పడకలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంటరైటిస్(జీఈ) విభాగాన్ని పరిశీలించారు. ఈ విభాగం ద్వారా రోగులకు అందే నాణ్యమైన వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ కలెక్టర్ వెంట ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

కాచి చల్లార్చిన నీటినే తాగండి

- ప్రజలకు కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సూచన

మచిలీపట్నం, జూన్ 22(ఆంధ్రజ్యోతి): కాచి చల్లార్చిన నీటినే తాగాలని జిల్లా ప్రజలకు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. జూలై 1వతేదీ నుంచి ఆగస్టు 31వతేదీ వరకు రెండు నెలలపాటు స్టాప్ డయేరియా పేరుతో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని, వర్షాకాలంలో ప్రజలు డయేరియా బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం వైద్య, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, మునిసిపల్, వివిధశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తాగునీరు కలుషితమైతే జిల్లా ప్రజలు డయేరియా బారినపడే అవకాశమున్నందున పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుద్ధి చేయించాలన్నారు. ట్యాంకులు శుద్ధిపై జిల్లావ్యాప్తంగా పరిశీలన చేస్తానని తెలిపారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని, తరచూ శాంపిళ్లను సేకరించి బయాలజీ ఎనాలిసిస్ చేయించాలని ఆదేశించారు. పురపాలకసంఘాల్లో సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు, గ్రామ సచివాలయాల్లో అసిస్టెంట్ ఇంజనీర్లు పైప్‌లైన్లకున్న లీకేజీలను పరిశీలించి వాటిని అరికట్టి కమిషనర్లు, ఎంపీడీవోలతో సంతకాలు చేయించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ వాటర్ ప్లాంట్లనుతనిఖీ చేయాలన్నారు. సురక్షిత తాగునీటిని తీసుకోవడంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, డీఈవో తాహెరా సుల్తానా, డీపీవో నాగేశ్వరనాయక్, జడ్పీ సీఈవో ఆనందకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.శివప్రసాద్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నాగాయితిప్ప సచివాలయంలో ఫర్నిచర్ మాయం

- సర్పంచ్ ఫిర్యాదుతో సచివాలయ కార్యదర్శిపై విచారణ

మోపిదేవి, జూన్ 22: మండలంలోని నాగాయితిప్ప గ్రామ సచివాలయంలో సచివాలయ కార్యదర్శి వెంకటరమణ ఫర్నిచర్‌ను మాయం చేశాడని సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం ఈవోపీఆర్డీ బి.అశోక్‌కుమార్ విచారణ జరిపారు. సచివాలయ కార్యదర్శి కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్, రికార్డులు, ఇతర మెటీరియల్‌ను మాయం చేశాడని ఇన్‌చార్జి ఎంపీడీవో రామలింగేశ్వరరావుకు సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో సెలవు అయినప్పటికీ సచివాలయ కార్యదర్శి వెంకటరమణ బయట వ్యక్తులతో వచ్చి కార్యాలయంలో ఉన్న బీరువాలు, కుర్చీలు ఆడుదాం ఆంధ్రా ఆట సామగ్రి కిట్లు, పలు రికార్డులు మాయం చేసినట్లు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. సెలవురోజుల్లో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులకు సమాచారం ఇవ్వకుండా కార్యాలయం నుంచి ఇష్టానుసారంగా ఫర్నిచర్ మాయం చేయడం ఏంటని గ్రామస్థులు అధికారులను నిలదీశారు. సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే సరిపోతుందా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ అనుమతి లేకుండా ఫర్నిచర్ మాయం చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీని గ్రామస్థులు కోరారు. పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు, పలువురు పాలకవర్గ సభ్యులు ఉన్నారు.



నాగాయితిప్పలో విచారణ నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ అశోక్‌కుమార్

ఎంపీ కేశినేని చిన్ని అల్పాహార విందు

- హాజరైన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

విద్యాధరపురం, జూన్ 22: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతోపాటు రాష్ట్రానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలకు శనివారం ఉదయం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అల్పాహార విందు ఇచ్చారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఇండియన్ క్రికెటర్ కేఎస్ భరత్ పాల్గొన్నారు. రామ్మోహన్‌నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి చిన్ని స్వాగతించారు. కొద్దిసేపు వారు రాజకీయాలు మాట్లాడుకున్నారు. టీడీపీ విజయానికి కృషి చేసిన వారందరికీ రామ్మోహన్‌నాయుడు అభినందనలు తెలిపారు. మాజీ మేయర్ శ్రీధర్, చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పారిశ్రామికవేత్త కరణం మోహనరావు, కొల్లూరి రవిబాబు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును సత్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని



మంత్రి సుభాష్‌తో ఎంపీలు చిన్ని, జీఎం హరీశ్ బాలయోగి

ఎంపీలను కలిసిన మంత్రి సుభాష్

కార్మిక శాఖ రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం గురునానక్‌నగర్‌లోని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) నివాసానికి వెళ్లారు. చిన్నితోపాటు అక్కడే ఉన్న అమలాపురం ఎంపీ జీఎం హరీశ్ బాలయోగిని మంత్రి కలిశారు. మంత్రిని ఎంపీలిద్దరూ సత్కరించారు. పార్లమెంట్ సమావేశాలకు తొలిసారి హాజరుకాబోతున్న ఎంపీలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల విశేషాలతోపాటు కార్మిక రంగంలోని పలు అంశాలపై వారు చర్చించుకున్నారు.

పత్తికి ప్రత్యామ్నాయం

మొక్కజొన్న, సుబాబుల్ సాగు వైపు రైతుల చూపు

- మూడేళ్లుగా వరుస నష్టాలతో తగ్గనున్న పత్తి సాగు విస్తీర్ణం

కంచికచర్ల, జూన్ 22: ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. వరుసగా మూడేళ్ల నుంచి నష్ట పోతుండటంతో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. తొలకరిలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు సుబాబుల్ సాగు చేసేందుకూ మొగ్గు చూపుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఏటా లక్ష ఎకరాల్లో పత్తి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది పత్తి సాగుకు రైతులు విముఖత చూపుతున్నారు. గత సంవత్సరం పత్తి రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఆశించిన దిగుబడులు రాలేదు. సగటున ఐదారు క్వింటాళ్లు కూడా రాలేదు. కొద్దిమంది రైతులకే పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. దీనికితోడు మార్కెట్ కూడా దోబూచులాడింది. సీసీఐ కూడా చురుకుగా కొనలేదు. పండిన కొద్ది పంటకు సైతం గిట్టుబాటు ధర లభించలేదు. కూలీల కొరత అంతాఇంతా కాదు. పత్తితీత కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వాటిల్లింది. అంతకు ముందు రెండేళ్లు కూడా నష్టపోవటంతో రైతులు పత్తి సాగు చేసేందుకు ముందుకు రావటం లేదు. దీంతో ఈ ఏడాది నందిగామ డివిజన్ పరిధిలో పత్తి విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి విత్తనాలు చురుకుగా అమ్ముడుపోవటం లేదని విత్తన డీలర్లు చెబుతున్నారు. 450 గ్రాముల బీటీ -2 పత్తి విత్తనాల ప్యాకెట్‌కు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.864, సాధారణంగా ఎంఆర్‌పీకి మించి అమ్ముతుంటారు. అలాంటిది పెద్దగా గిరాకీ లేనందున ఎనిమిది వందల నుంచి రూ.850 లోపు అమ్ముతున్నారు. పత్తి సాగు తగ్గటంతో మొక్కజొన్న విస్తీర్ణం బాగా పెరగనున్నది. ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ పంటకు కూలీలతో పెద్దగా అవసరం లేదు. పంట కోతకు యంత్రాలు వినియోగిస్తుండటం వల్ల పని సులువుగా అవుతోంది. దీంతో రైతులు మొక్కజొన్న వేస్తున్నారు. నందిగామ డివిజన్ పరిధిలో సుబాబుల్ విస్తీర్ణం కూడా క్రమేణా పెరుగుతోంది. కొద్ది నెలల నుంచి మార్కెట్లో సుబాబుల్ కర్రకు గిరాకీ పెరిగింది. గిట్టుబాటు ధర లభిస్తుండటంతో ఇప్పటికే ఎక్కువ మంది రైతులు సుబాబుల్ విత్తనాలు వేశారు.



సుబాబుల్ విత్తనాలు నాటుతున్న కూలీలు

ఢిల్లీరావుకు జాతీయ అవార్డు

- మాదకద్రవ్యాల నిరోధం, బాలల హక్కుల పరిరక్షణపై అత్యుత్తమ పనితీరుకు గుర్తింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కృష్ణలంక): మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అడ్డుకోవడం, బాలల హక్కుల పరిరక్షణలో చూపిన అత్యుత్తమ పనితీరుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును జాతీయ అవార్డు వరించింది. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్త కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణలో ప్రత్యేక దృష్టిపెట్టిన ఆయనకు ఈ గుర్తింపు లభించింది. కలెక్టర్ ఢిల్లీరావుకు బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ నుంచి శనివారం సమాచారం అందింది. దీంతో ఈనెల 30న న్యూఢిల్లీలోని రాజ్‌పథ్ ఏరియా, మౌలానా ఆజాద్ రోడ్డులో గల విజ్ఞాన్ భవన్ నందు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రశంసాపత్రం, అవార్డును అందుకోనున్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు పోలీస్, టాస్క్‌ఫోర్స్, చైల్డ్‌లైన్, హెల్త్‌కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ, ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్, నవజీవన్ బాలభవన్, సంయుక్త ఫౌండేషన్‌లను ఏకతాటిపైకి తీసుకొచ్చి జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిరోధంపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి, అమలు చేయడంలో, బాలల సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో పూర్తిస్థాయిలో ఆయన సఫలీకృతమయ్యారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.10

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

హనుమాన్‌జంక్షన్, జూన్ 22 : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం స్టూడెంట్‌కిట్స్‌ను అందిస్తోందని రంగన్నగూడెం సర్పంచ్ కసుకుర్తి రంగామణి తెలిపారు. శనివారం గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్స్‌ను సర్పంచ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగామణి మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు ఉందన్నారు. పాఠశాలల్లో అన్ని మౌళిక వసతులు కల్పించడానికి సీఎం చంద్రబాబు అన్ని రకాల చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీ నారాయణ, పీఏసీఎస్ అధ్యక్షు డు మొవ్వా శ్రీనివాసరావు, తుమ్మల దశరథరామయ్య, కసుకుర్తి రాధాకృష్ణమూర్తి, హెచ్ఎం.ఆర్. గ్లోరీ స్వర్ణలత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రైతులు దగా

- రైతు భరోసా కేంద్రాలు కాదు.. దగా కేంద్రాలు
- రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం
- కోమటిగుంటలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



నాగలిపట్టి దుక్కిదున్నుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూన్ 22 : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని కోమటిగుంట వద్ద శనివారం నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. సాగు కాలువలు, మురుగు కోడులు బాగు చేసిన దాఖలాలు లేవన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులను సైతం సరఫరా చేయలేదన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ప్రకటించటంలోనూ వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన మేర పంట కాలువలు బాగు చేసినా, 2025 ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి ప్రణాళికతో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకర్, సుదిమళ్ల రవీంద్ర, మార్పూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్, మద్దాలి రామచంద్రరావు, యార్లగడ్డ రాజా, గోగినేని వెంకటరమణ, గోగులమూడి చౌదరి, పావనమూర్తి, యనమదల మదన్, కళ్యాణి, శేషుకుమారి, జనసేన పార్టీ నాయకులు ముప్పా రాజా, తాతపూడి గణేష్, పచ్చిపాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తా : మంత్రి నారాయణ



నారాయణకు మొక్కను అందజేస్తున్న కమిషనర్

పెనమలూరు, జూన్ 22 : తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కమిషనర్‌కు హామీ ఇచ్చారు. శనివారం కానూరులోని మంత్రి నివాసంలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటి పన్నుల విధింపుపై సమీక్ష

పెనమలూరు, జూన్ 22 : తాడిగడప మునిసిపాలిటీలో నూతనంగా ఇంటి పన్నుల విధింపునకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. పోరంకి గ్రామ శివాలయం ఎదురుగా ద్వారకా రెసిడెన్సీ ఆవరణలో ఇంటి పన్నుల కోసం ఎమ్మెల్యే అధ్యక్షతన దరఖాస్తులు స్వీకరించి సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కొత్త ఇంటి పన్నుకు రిజిస్టర్డు డాక్యుమెంటు, లింక్ డాక్యుమెంటు, ఆధార్, ఈసీ, నోటరీ ఎఫిడవిట్, బిల్డింగ్ ప్లాన్ తదితర ధృవపత్రాలను తీసుకురావాలని కోరారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో మోసం

పెనమలూరు, జూన్ 22 : క్రిప్టో కరెన్సీ పేరుతో రెండు లక్షలకు పైగా మోసపోయిన కేసులో పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన రెహమాన్ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ ఏజెంటుగా పనిచేస్తాడు. కొన్ని రోజుల క్రితం అతని సెల్‌ఫోన్‌కు ఒక కాల్ వచ్చింది. ఇంటివద్ద నుండే పార్టు టైం జాబ్ చేసుకోవచ్చని, వెయ్యి నుంచి ఐదువేల వరకు పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు పొందవచ్చని నమ్మబలకగా బాధితుడు రెహమాన్ క్రిప్టో గోకలట్ టెలిగ్రాం గ్రూప్‌లో చేరాడు. గ్రూప్‌లో వివిధ టాస్కలలో మొత్తం రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి పెట్టిన డబ్బునంతా ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టిన డబ్బేనని పోలీసులకు తెలిపాడు. రెండు లక్షల డబ్బును విత్‌డ్రా చేద్దామంటే ఎంతకీ రాకపోయేసరికి పెనమలూరు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత తుమ్మలపల్లి జన్మదినం



కేక్ కట్ చేస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ

కంకిపాడు, జూన్ 22 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి హరికృష్ణ మాట్లాడుతూ, టీడీపీలో నాయకులు, కార్యకర్తలు అన్న తేడా లేకుండా ప్రతి కుటుంబ సభ్యుడి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం కంకిపాడు ఫ్లైఓవర్ వద్ద గల పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, బొప్పూడి శివరామకృష్ణ, గోగినేని వెంకటరమణ, కొండవీటి శివయ్య, ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజా, సుధీర్, జనసేన పార్టీ నాయకులు బాయిన నాగరాజు, సుంకర సురేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో సత్యసాయి శత రుద్రీయం నేడు

హనుమాన్‌జంక్షన్, జూన్ 22 : భగవాన్ సత్యసాయి బాబా 2025లో నిర్వహించనున్న శత జయంతోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హనుమాన్‌జంక్షన్‌లో 84వ మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు స్థానిక సత్యసాయిబాబా సేవా మండలి కన్వీనర్ బెక్కం వేంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబరు 23న బాబా 100వ జన్మదినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. ఆ రోజు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 108 (నమామి సాయి శత రుద్రీయం) మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించాలని సత్యసాయి బాబా సేవా సంస్థ రాష్ట్ర కమిటీ పిలుపు ఇచ్చినట్టు పేర్కొన్నారు.

మచ్చలేని నాయకుడు అయ్యన్నపాత్రుడు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూన్ 22 : సుదీర్ఘ రాజకీయ చరిత్రలో మచ్చలేని నాయకుడు అయ్యన్నపాత్రుడు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడును శనివారం విజయవాడలోని ఆయన నివాసంలో కలసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వైవీబీ మట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టి వేధించినా చెక్కుచెదరని మనోధైర్యంతో పార్టీకోసం పోరాటాలు చేసిన అయ్యన్నపాత్రుడు ఈతరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని అంజనేయులు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య, ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏజెర్ల వినోద్‌రాజా, సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంపన వీర శ్రీనివాస్, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అజ్మతుల్లా, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్ తదితరులు అయ్యన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

మానికొండలో పారిశుధ్య చర్యలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉంగుటూరు, జూన్ 22 : మండలంలో మేజర్ పంచాయతీలైన మానికొండ, తేలప్రోలు, పెదఅవుటపల్లి గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం అనే అంశంపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మానికొండ పంచాయతీ అధికా రులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రత్నకిషోర్ సిబ్బందితో కలిసి శనివారం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్త, డ్రైనేజీ సమస్యలను పరిశీలించి పారిశుధ్య చర్యలకు నడుంబిగించారు. ముఖ్యంగా మానికొండ నుండి తరిగొప్పల వెళ్లే రహదారి పక్కన భారీగా డంప్‌చేసిన చెత్తను పంచాయతీ సిబ్బంది జేసీబీ సాయంతో తొలగించి, ట్రాక్టర్లద్వారా స్థానిక చెత్తసంపద కేంద్రానికి తరలించారు.



రోడ్డు పక్కన చెత్త కుప్పలు తొలగిస్తున్న పొక్లెయినర్

వేడుకగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

ఉంగుటూరు, జూన్ 22 : చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమైందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. శనివారం మండలంలోని తేలప్రోలు, పొట్టిపాడు గ్రామాల్లోని పలు అంగన్వాడీ సెంటర్లలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సందడిగా జరిగాయి.

పెనమలూరు : పోరంకి అంగన్వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, మంచినేని పరమేష్ పాల్గొన్నారు.

సీఐడీ మాజీ చీఫ్ సునీల్ వైసీపీకి తొత్తు

టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తుల

కంకిపాడు, జూన్ 22 : వైసీపీ ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించిన సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌ను బదిలీ చేయడంపై పలు కులసంఘాలు రాద్ధాంతం చేయడం సరికాదని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బత్తుల కామేశ్వ రరావు అన్నారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన సునీల్ కుమార్ ఎస్సీలకు ఏం చేశారని ప్రశ్నించారు. జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారన్నారు. సునీల్ కుమార్ పని తీరుపై మండిపడ్డారు. ఇలాంటి కుల వంచకుడికి కుల సంఘాలు మద్దతు ఇవ్వకూడదని కామేశ్వరరావు కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు దొప్పల పూడి నాగేశ్వరరావు, జెల్లి కోటేశ్వరరావు, బండి కృష్ణబాబు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు సత్కారం

గన్నవరం, జూన్ 22: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. మండలంలో 10వ తరగతి మార్కులు అత్యధికంగా సాధించిన స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీ కె.వర్షిత, రెండవ స్థానం అబ్దుల్ సాదియ, మూడవ స్థానం వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థినీ ఎ.అరుణలకు నగదు పురస్కారాలు అందజేశారు. అన్ని పాఠశాలల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు రూ.500, మెమొంటో, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు అందించారు. మండలం లోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలను సత్కరించారు. పేదరికంతో ఇబ్బంది పడుతున్న వీర మాచినేని వెంకటేశ్వరమ్మకు రూ.3వేలు, కేన్సర్‌తో బాధపడుతున్న ప్రశస్త జాయికి రూ.15వేలు అందజేశారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయటమే మానవతా ముఖ్య లక్ష్యమని తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కర్ర వరప్రసాద్, కెఎస్ జగదీశ్వర రావు, గన్నె వెంకట్రావు, డ్యాన్స్ మాస్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పద్మావతి

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పద్మావతి

గన్నవరం, జూన్ 22 : రైతులకు మెరుగైన సేవలందించి వారి మన్ననలు పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి పద్మావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో వ్యవసాయశాఖ సబ్ డివిజన్ స్థాయిలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. పీఎం కిసాన్, ఈ క్రాప్ బుకింగ్ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో వారి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, పెనమలూరు, ఉయ్యూరు, పమిడిముక్కల మండలాల వీఏఏలు పాల్గొన్నారు. అనంతరం ఎరువుల డీలర్‌లతో సమావేశం నిర్వహించి ఎరువులు, పురుగు మందులు నాశిరకం విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడి విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని వివరించారు. డీడీ వైవీఎస్ మోహనరావు, ఏడీఏలు మహిధర్, తోటకూర శ్రీనివాసరావు, ఏవో ఎస్ఎల్ తేజస్వీ పాల్గొన్నారు.



వరినాట్లు వేస్తున్న కూలీలు

గండిగుంటలో వరినాట్లు ప్రారంభం

గండిగుంట(ఉయ్యూరు), జూన్ 22 : ఖరీఫ్ సీజన్‌కు ఉయ్యూరు మండల పరిధిలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. గండిగుంట గ్రామపరిధిలో రైతు గొల్లపూడి వేణుబాబు పొలంలో శనివారం వరినాట్లు ప్రారంభించారు. బోరు సౌకర్యం ఉన్నవారు గతనెలలో నారుమడులు పోసి పెంచి నాలుగు వారాల వ్యవధి తరువాత నాట్లు ప్రారంభించారు. నవంబరు, డిసెంబరు నెలల్లో పంట చేతికొచ్చే తరుణంలో తుఫానులు, వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోవడం ప్రతియేటా జరుగుతున్న నేపథ్యంలో జూన్‌లో నాట్లువేసి ప్రకృతి వైపరీత్యాల నుంచి తప్పించుకునేందుకు కష్టపడుతున్నారు. పంటచేతికొస్తున్న సమయంలో ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా ఉంటామని రైతులు ఆశపడుతున్నారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి

ఉయ్యూరు సీఐ హబీబ్‌బాషా

ఉయ్యూరు, జూన్ 22 : మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి యువకులు బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవద్దని ఉయ్యూరు సీఐ హబీబ్‌బాషా అన్నారు. జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినం పురస్కరించుకుని నారాయణ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తు పాడు చేసుకోవద్దని, మాదక ద్రవ్యాలు కలిగిఉన్నా, వినియోగించినా తీసుకునే చర్యలు వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్ఐ వసంతరావు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ హబీబ్‌బాషా

ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాలలో..

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా మంచినడవడికతో కష్టపడి చదివి ప్రయోజకులు కావాలని ఎస్ఈబీ సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. స్నేహితులతో కలసి సరదాగా మత్తుపదార్థాలు తీసు కుంటే వాటికి బానిసలై జీవితం దుర్భరం చేసుకుంటారని ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్ అన్నారు. కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.శేఖర్ బాబు, టి.నరసింహారావు, ఎండీ నూర్‌బాషా పాల్గొన్నారు.

తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో..

ఉంగుటూరు: మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వంటి చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా వుండాలని, వీటికి అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హనుమాన్ జంక్షన్ సీఐ ఏ.నవీన్‌నరసింహమూర్తి హితవు పలికారు. హనుమాన్ జంక్షన్ సర్కిల్ పరిధిలోని ఆత్కూరు పీఎస్ ఆధ్వర్యంలో శనివారం తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియయం, దుష్ఫలితాలు అనే అంశంపై సీఐ నరసింహమూర్తి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు మార్గాలవైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని, ముఖ్యంగా గంజాయి, కొకైన్, గుట్కావంటి వాటికి విద్యార్థులు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో వుంచుకుని క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తద్వారా కళాశాలకు, చదువునేర్పిన గురువులకు మంచిపేరు తీసుకురావాలని సీఐ సూచించారు. కాగా సైబర్ నేరాలపై ఆత్కూరు, జంక్షన్ ఎస్సైలు జనార్థన్, పైడిబాబు వివరించారు. ఈకార్యక్రమంలో ఇంజనీరింగ్ కళా శాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	134, 143, 154
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.10



ఏరువాక సందర్భంగా ఆదర్శ రైతు నరసింహారావుకు సత్కారం

ఘంటసాల : ఏరువాక పండుగ సందర్భంగా ఘంటసాలలో ఆదర్శ రైతు గొర్రెపాటి వెంకట నరసింహారావును పలువురు ప్రముఖులు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి విద్యాట్రస్ట్ ప్రతినిధులు కొండపల్లి రామకృష్ణ, కౌలు రైతు భలే జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

గుడివాడ : మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ పి.శ్రీకాంత్ హితవు పలికారు. కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐలో మత్తు పద్ధార్థాల వాడకం వలన జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితం చాలా విలువైనదని, భవిష్యత్తును నిర్ణయించుకునే సమయమన్నారు. తల్లిదండ్రులు కాయకష్టం చేసి చదివిస్తున్నారని, వారి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి ఉందన్నారు. చెడు వ్యసనాలకు లోను కాకుండా జీవితాలను సక్రమ మార్గంలో ఉంచుకోవాలని సూచించారు. టూటౌన్ సీఐ ఎం.ఎన్ దుర్గారావు, కళాశాల ప్రిన్సిపాల్ గౌరీమణి, ఎస్సైలు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు చిట్టిబాబు మృతి



చిట్టిబాబు భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కాగిత

కృత్తివెన్ను : టీడీపీ సీనియర్ నాయకుడు, నీలిపూడి గ్రామ మాజీ వైస్ ప్రెసిడెంట్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పుప్పాల చిట్టిబాబు శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హుటాహుటిన నీలిపూడి విచ్చేసి పుప్పాల చిట్టిబాబు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చిట్టిబాబు ఓదార్చి, ధైర్యం చెప్పారు. చిట్టిబాబు మృతి తీరని లోటని కాగిత పేర్కొన్నారు. చిట్టిబాబు అంతిమ యాత్రలో కాగిత పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



కోడూరు : కోడూరులో శ్రీ దేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ 28వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దుంబాల శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి ఉడత్ మస్తానరావు దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. మురళీ కోలాటం, సహస్ర దీపాలంకరణ కనువిందు చేశాయి. ఆలయ ట్రస్టీ కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.



వెహికల్ డిపోను సందర్శిస్తున్న కార్పొరేటర్లు నాగరాము తదితరులు



వెహికల్ డిపోలో గుట్టలు గుట్టలుగా పడి ఉన్న చెత్త సేకరణ ట్రాక్టర్లు, డంపర్ బిన్లు

కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి సాక్ష్యాలివే

- కార్పొరేషన్ వెహికల్ డిపోలో శిథిల స్థితిలో ట్రాక్టర్లు, పారిశుధ్య యంత్రాలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- తక్షణం చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్

మచిలీపట్నం టౌన్, జూన్ 22 : వైసీపీ అసమర్థ పాలన కారణంగా మచిలీపట్నం నగరంలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా తయారైందని టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత పేర్కొన్నారు. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా మచిలీపట్నం నగర పాలక సంస్థలో పారిశుధ్యానికి వినియోగించే వాహనాలు, పరికరాలు పాడైపోయి లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని ఆరోపించారు. శనివారం టీడీపీ కార్పొరేటర్లు కార్పొరేషన్ వెహికల్ డిపోను సందర్శించి పాడైపోయిన ట్రాక్టర్లు, పారిశుధ్య పరికరాలను పాత్రికేయులకు చూపించారు. లక్షల రూపాయల విలువగల ట్రాక్టర్లు, చెత్త పోగుచేసే వాహనాలు, రోడ్లు క్లీన్ చేసే యంత్రాలు, దోమల మందు పిచికారీ యంత్రాలు శిథిలమై ఉండటాన్ని గమనిచిఆ ఆవేదన వ్యక్తం చేశారు. క్లాప్ నిధులతో కొన్ని పరికరాలు, మునిసిపల్ సాధారణ నిధుల నుంచి కొన్ని పరికరాలు కొనుగోలు చేసిన వైసీపీ పాలకులు పారిశుధ్య పరికరాలను సద్వినియోగం చేసుకోవడంపైన, మరమ్మతులు చేయించడంపైన శ్రద్ధ చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాక్టర్లు, పారిశుధ్య యంత్రాలు పాడైపోవడం వల్లే కొన్ని డివిజన్‌లలో పారిశుధ్యం అధ్వానంగా తయారైందన్నారు. శిథిల, దెబ్బ తిన్న పారిశుధ్య ట్రాక్టర్లు, యంత్రాలకు మరమ్మతులు చేయించి పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు. యంత్రాలకు మరమ్మతులు చేయించకుండా మూలనపడేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మారినా కార్పొరేషన్ అధికారుల తీరు ఇంకా మారలేదని టీడీపీ కార్పొరేటర్లు పేర్కొన్నారు.



మొక్కు తీర్చుకున్న బాబూజీతో టీడీపీ నేతలు

కూటమి అధికారంలోకి వచ్చిందని మోపిదేవిలో తలనీలాల సమర్పణ

ఘంటసాల, జూన్ 22 : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో మల్లాయి చిట్టూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుత్తి బాబూజీ శనివారం మోపిదేవిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. టీడీపీ నాయకులతో కలిసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, సర్పంచ్ ఆవుల ధర్మ వెంకటనరసయ్య తుమ్మల సందేశ్వరరావు, ఆవుల చంటిబాబు, ఆవుల నాగాంజ నేయులు, గరికపాటి గోవిందరాజు, కొమ్ము సుందరరావు, కుంపటి ఉదయ్ బాబు, గుత్తి ధనలక్ష్మి పాల్గొన్నారు.



పెదయాదర సచివాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాల ఆవిష్కరణ

మంత్రి పవన్‌కల్యాణ్ హామీ హర్షణీయం

- పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతీ

మచిలీపట్నం టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన కోట్లాది రూపాయల సొమ్మును పంచాయతీలకు జమ చేయించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇవ్వడం ముదావహమని పెదయాదర సర్పంచ్, రాష్ట్ర గ్రామ సర్పంచ్‌ల సంఘం నాయకులు గల్లా తిమోతి అన్నారు. పెదయాదర గ్రామ సచివాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటంతో పాటు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలను శనివారం ఆవిష్కరించారు. తిమోతి మాట్లాడారు జగన్ రెడ్డి హయాంలో గ్రామాల్లో సర్పంచ్‌లకు నిధులు లేక అప్పులు పాలయ్యారన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి రావడంతో సర్పంచ్‌లకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వచ్చాయన్నారు.



కోడూరులో వర్ధమాన నటుల పుట్టినరోజు వేడుక

కోడూరు : టీఎస్ఆర్ మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో తికమకతాండ సినిమాలో హీరోలుగా నటించిన కోడూరుకు చెందిన తిరుపతి రామ్, హరి పుట్టిన రోజు వేడుకలు ప్రధాన సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య పాల్గొని కేక్ కట్ చేశారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. వారు మరిన్ని సినిమాల్లో నటించి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. పూతబోయిన కరుణ కుమార్, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కొండవీటి సునీత, అద్దంకి పాండురంగారావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, వేముల వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, దోవా గోవర్ధన్, కాగిత రామారావు, ఉల్లి శేషగిరిరావు, టిఎస్ఆర్ గ్రూపు సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 22 : రేషన్ డీలర్లు సక్రమంగా నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని బందరు నార్త్ తహసీల్దార్ సతీష్, సౌత్ తహసీల్దార్ వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం రేషన్ షాపు డీలర్లతో తహసీల్దార్లు సమావేశం నిర్వహించారు. ఆర్ఐ యాకూబ్, డీటీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

మచిలీపట్నం టౌన్, జూన్ 22 : ఆదర్శనగర్‌లో చెల్లిలి భర్తపై బావమరుదులు దాడి చేసిన ఆదర్శనగర్‌లో జరిగింది. అబ్దుల్లా, అతని భార్య నూరున్నీసా మధ్య తగాదాలు జరుగుతున్నాయి. దీంతో నూరున్నీసా మాచవరంలో నివసిస్తున్న తన అన్నలు అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ ఇస్మాయిల్‌కు ఫోన్ చేసి చెప్పింది. తన చెల్లి ఫిర్యాదు మేరకు బావ అబ్దుల్లాపై ఖాదర్, ఇస్మాయిల్ దాడి చేశారు. గాయపడిన అబ్దుల్లాను ఆసుపత్రిలో చేర్పించి, ఎస్సై గంగాధర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి ఆర్థిక సాయం

మోపిదేవి : ప్రశాంతి నగర్‌కు చెందిన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కాకర్లమూడి రాజేష్‌కు మోపిదేవి వ్యాపార మిత్ర బృందం సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. గరికపాటి బుల్లిబాబు, ఆంజనేయ ప్రసాద్, కోటేశ్వరరావు, రవితేజ, ప్రసాద్ ఉన్నారు.

తోటకు టీడీపీ నివాళి

పెడన రూరల్ : పైడమ్మ ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త తోట నాగేశ్వరరావు భౌతికకాయానికి టీడీపీ నేత బొడ్డు వేణుగోపాలరావు నివాళులర్పించారు. ఈవో రామ్మోహనరావు, శ్యామలయ్య, చందవ నారాయణరావు, వెలికట్ల ప్రసాద్, నాగేశ్వరరావు, నాగు, కొల్లూరి రాధాకృష్ణ నివాళులర్పించారు.



విద్యార్థులకు పుస్తకాల వితరణ

ఘంటసాల : దేవరకోటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఎన్ఆర్ఐ దోనేపూడి సాయిజీ తల్లిదండ్రులు దోనేపూడి వెంకటేశ్వరరావు - మునీశ్వరమ్మ జ్ఞాపకార్థం నోటు పుస్తకాలు, పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు వితరణగా అందజేశారు. ఎంఈవో ఎస్.శివశంకర్, సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, దోనేపూడి మురళీకృష్ణ, ఎం.శారద, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే లక్ష్యం

అవనిగడ్డ : యువతకు ఉద్యోగాల కల్పన ధ్యేయంగా కృషి చేస్తామని మండలి వెంకట్రామ్ అన్నారు. గరికపాటి రామ్, వివేక్ మిత్ర బృందం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 50 వారాలకు చేరుకున్న సందర్భంగా శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. వెంకట్రామ్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ బాటలో పేదలకు అన్నదానం చేయటం అభినందనీయమన్నారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ్, టివి.గిరి, బొప్పన భాను, కొండవీటి సునీత, రాజేంద్ర, యర్రంశెట్టి దామోదరరావు, మునిపల్లి శ్రీలక్ష్మీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతులకు కూటమి నాయకుల నివాళి

కోడూరు : విశ్వనాథపల్లి గ్రామ టీడీపీ నాయకులు తోట రాంబాబు మాతృమూర్తి తోట గౌరమ్మ (87) శుక్రవారం మృతి చెందారు. మండల కూటమి శ్రేణులు గౌర మ్మ భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. నరసింహాపురంలో అనారోగ్యం తో మృతి చెందిన వక్కలగడ్డ వీర రాఘవయ్య భౌతికదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు, మద్దూరి కాంతారావు, వేములపల్లి శ్రీకృష్ణ, ఉల్లి శేషగిరి, దామెర్ల నారాయణ, బచ్చు వెంకటేష్, దావు మల్లి, తోట సాంబయ్య, జరుగు పోతురాజు, రమణ పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ : పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ టి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ, చౌదరిపేట, లక్ష్మీనగర్ కాలనీలలో మరమ్మతు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 8గంట నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని రామకృష్ణ కోరారు.

నాగాయలంక, కోడూరు, మండలాల్లో

కోడూరు : ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటినెన్స్ కారణంగా అవనిగడ్డ సబ్ స్టేషన్ పరిధిలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు, నాగాయలంక మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.